సాక్షి
చిత్తూరు
గురువారం । 10 । ఏప్రిల్ । 2025



డబ్లింగ్‌కు ఆమోదం

ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న తిరుపతి–కాట్పాడి డబ్లింగ్‌కు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. - 8లో



మహేశ్వరయ్య.. మజాకానా!

చంద్రగిరి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య ఇంటిపై ఏసీబీ దాడి చేసి రూ.30 కోట్ల ఆస్తులు వెలుగుచూశాయి. - 8లో



రెడ్‌క్రాస్ బృందానికి అభినందన

జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన జూనియర్ రెడ్‌క్రాస్ బృందానికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

చిత్తూరంటే బస్సు ఎక్కించాల్సిందే...

–డీఎంలకు ఉత్తర్వులు జారీ చేసిన డీపీటీఓ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : తమిళనాడులోని వేలూరు బస్టాండులో చిత్తూరు ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తిరుపతి–వేలూరు సర్వీసుల్లో చిత్తూరంటే బస్సు దిగేమంటున్నారని, అర్ధరాత్రి అవస్థలు పడుతున్నారని ఫిర్యాదులు చేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో గతవారం 'చిత్తూరా సీటు లేదు', 'వేలూరు బస్టాండులో రగడ' అనే పేరిట కథనాలొచ్చాయి. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. తమిళనాడులోని వేలూరు బస్టాండులో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వేలూరు నుంచి వచ్చే చిత్తూరు వాళ్లు రాత్రి పూట ఇబ్బంది పడకూడదని డీపీటీఓ జగదీష్‌కు వివరించారు. ఇకపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆయనకు తెలియజేశారు.

16వ తేదీన సంకటహర చతుర్థి

కాణిపాకం : ఈనెల 16వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి గణపతి వ్రతం జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు వ్రతం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వర్ణ రథోత్సవం ప్రారంభమవుతోందన్నారు. ఈ సేవలకు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందవచ్చునని పేర్కొన్నారు.

సామాన్యుడి వంటింట్లో గ్యాస్ ధరల మంట చిచ్చురేపుతోంది. ఒక్కసారిగా సిలిండర్‌పై రూ.50 పెంపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు గుదిబండగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సిలిండర్ ధరలు పెంచబోమని, ఏటా 3 ఉచిత సిలిండర్లు ప్రతి కుటుంబానికి అందజేస్తామని హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం నాలుక మడతేసింది. ఉచిత సిలిండర్‌లకు నిబంధనల కత్తి పెట్టి అరకొరగా ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ప్రస్తుతం చమురు సంస్థలు సిలిండర్‌కు రూ. 50 పెంచినా పాలకులు కిమ్మనకపోవడంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బండ బాదుడే!

- గ్యాస్ సిలిండర్ ధరపై రూ.50 పెంపు
- సామాన్యులపై గ్యాస్ బండ మోత!
- సిలిండర్ ధరల పెంపుపై మహిళల ఆవేదన

పలమనేరు : కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో భాగంగా ఏడాదికి మూడు చొప్పున ఉచిత సిలిండర్ల మాట దేవుడెరుగు. సిలిండర్ ధరలు పెంచకుంటే చాలు అనేమాట అందరిలోనూ వినిపిస్తోంది. భారీగా సిలిండర్ ధర పెంచుకుంటూ పోతే ఎలా బతికేదని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు సిలిండర్ ధర రూ.840గా ఉండగా దానికి రవాణా చార్జీలు కలిపి రూ.850 దాకా వసూలు చేస్తున్నారు. ఇప్పుడు పెంచిన రూ.50తో సిలిండర్ ధర రూ.900 చేరుకుంది. ధరల పెంపు పేద, మధ్య తరగతి ప్రజలకు అదనపు భారంగా మారింది.

ఉచిత గ్యాస్..

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్ అబాసుపాలవుతోంది. జిల్లాలోని మొత్తం రేషన్ కార్డుల్లో 30 శాతం మంది ఇందులో అర్హులుగా తేలారు. వీరికి ఏడాదికి మూడు చొప్పున సిలిండర్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ మేరకు లబ్ధిదారులు సిలిండర్‌కు రూ.850 చెల్లిస్తే వీరి ఖాతాలో ప్రభుత్వం వేసే నగదు రూ.800 మాత్రమే. ఆ లెక్కన ఏడాదికి ఈ పథకం ద్వారా మూడు సిలిండర్లకు ఓ కుటుంబానికి దక్కేది కేవలం రూ.2,400 మాత్రమే. అయితే అర్హులైన వారిలో చాలా మందికి గ్యాస్, బ్యాంకు ఖాతా, ఆధార్ లింక్‌తో పాటు ఈకేవైసీ లేనందున సాంకేతిక సమస్యలతో డబ్బు పడడం లేదని తెలుస్తోంది.

మరీ ఇంత మోసమా..



ఉచితంగా గ్యాస్ అని చెప్పి తీరా మూడు సిలిండర్లు.. అది కూడా అర్హులైన వారికేనని మాట మార్చారు. ఆయిల్ కంపెనీలు ధర పెంచాయంటూ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచితే ఎలా బతికేదో కూటమి నేతలకే తెలియాలి. – జమీల, గృహిణి, పలమనేరు

సామాన్యులకు దెబ్బమీద దెబ్బ



సూపర్‌సిక్స్ పేరిట కూటమి జనానికి పంగనామాలు పెట్టింది. ఇప్పుడు గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచితే ఏమనాలి. ఇంత ఘోరమైన ప్రభుత్వం మరొక్కటి ఉంటుందా? – భువనేశ్వరి, ఐద్వా జిల్లా కన్వీనర్, పలమనేరు

జిల్లాలో గ్యాస్ వినియోగదారుల సమాచారం	
మొత్తం గ్యాస్ కనెక్షన్లు	6.88 లక్షలు
ఇందులో దీపం గ్యాస్ కనెక్షన్లు	2.45 లక్షలు
వీటిలో ఉజ్వల కింద (మిగిలినవి జనరల్‌లో కేటగిరి)	12 వేలు..
రోజుకు అవసరమయ్యే గ్యాస్ సిలిండర్లు దాదాపు	12 వేలు

అదనపు భారం



పెంచిన గ్యాస్ మోత కారణంగా జిల్లాలోని కుటుంబాలపై రూ.1.60 కోట్ల అదనపు భారం ఈనెల నుంచి పడనుంది. తాము అధికారంలోకి వస్తే ఎలాంటి పరిస్థితుల్లోనూ గ్యాస్ ధరలను పెంచమని కూటమి నేతలు గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. దీంతో పాటు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని మాట ఇచ్చి అది కాదని తెలిసి ఏటా మూడు సిలిండర్లు మాత్రమే అది కూడా జల్లెడపట్టి ఎంపిక చేసి మోసం చేశారు. దీంతో సిలిండర్లు ఉచితంగా వద్దనే మాట మహిళల్లో వినిపిస్తోంది. ఏటా ఉచితంగా ఇచ్చే ఆ మూడు ఇస్తే.. ఏమీ ఇవ్వకుంటే ఏమనే మాట వినిపిస్తోంది. దీనికి తోడు అలా ఇచ్చి ఇలా.. ధరలు పెంచడం ఏంటనే విమర్శలు లేకపోలేదు.

ముగిసిన 'పది' మూల్యాంకనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ పాఠశాలలో ఏడు రోజులుగా సాగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియ బుధవారంతో ముగిసింది. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీగా ప్రక్రియ పూర్తి చేసినట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మూల్యాంకన ప్రక్రియకు జిల్లాలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలను, ఆయా సబ్జెక్టు టీచర్లను నియమించినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన 1,74,808 పదో తరగతి పరీక్షల జవాబుపత్రాలను ఈనెల 9వ తేదీ వరకు మూల్యాంకనం చేసినట్లు వివరించారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి 16,232 మంది జవాబుపత్రాలను మూల్యాంకనం చేశారన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై లఘు చిత్ర పోటీలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టపరంగా నేరమని, దీనిపై ప్రజల్లో మరింత అవగాహన తీసుకొచ్చేందుకు లఘు చిత్ర పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి తెలిపారు. 30 సెకండ్ల వీడియో ఉండాలన్నారు. ఉత్తమ వీడియోలకు బహుమతులు ఉంటాయన్నారు. బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఆసక్తిదారులు తమ వీడియోలను 15 రోజుల లోపు చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపాలన్నారు. లేనిపక్షంలో 9949236530 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

చౌడేపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలైందని, ఎన్నికలప్పుడు ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. బుధవారం పులిచెర్ల మండలం కొత్తపేటలో పెద్దిరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు కలిసి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీల సంగతిపై పోరాటం చేయాలని పెద్దిరెడ్డి కోరారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై పోరాడి పేద ప్రజలకు న్యాయం చేయాలన్నారు. కూటమి దౌర్జన్య కాండపై ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీలు శ్రీరాములు, లక్ష్మి నర్సయ్య , నేతలు మోహన్, శ్రీనివాసులు తదితరులున్నారు.



కొత్తపేటలో దామోదరరాజుకు సూచనలిస్తున్న పెద్దిరెడ్డి

డెంగీ నివారణకు చర్యలు తీసుకోవాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : డెంగీ వ్యాప్తిపై అప్రమత్తం వ్యవహరిస్తూ..తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం సబ్ యూనిట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ఫైలేరియా కిడ్స్ వ్యాధి గ్రస్తులకు ఆరోగ్య సూత్రాలపై వివరించాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలన్నారు. డెంగీ కేసులు నమోదైతే తక్షణం స్పందించాలన్నారు. నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానికులకు అవగాహన కల్పించాలని వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఖైదీల జీవనోపాధికి బ్యాంకు రుణాలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు అర్బన్ : ఖైదీల్లో పరివర్తన తీసుకురావడానికి జైలు నుంచి విడుదలైన తరువాత వాళ్లకు బ్యాంకు రుణాలను మంజూరు చేస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం చిత్తూరు నగరంలోని జిల్లా జైలులో ఖైదీలకు సంకల్ప–స్కిల్ ట్రైనింగ్‌లో భాగంగా మల్టీస్కిల్ ట్రేడ్ కింద శిక్షణ పొందిన ఖైదీలకు సర్టిఫికెట్లను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తెలిసీ తెలియక ఆవేశంలో చేసిన తప్పులకు శిక్ష ఒక్కటే పరిష్కారం కాదన్నారు. సత్ప్రవర్తనతో జైలు నుంచి విడుదలయ్యాక డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో ఖైదీలకు శిక్షణ ఇవ్వడంతో పాటు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ ద్వారా రుణాలు అందిస్తామన్నారు. జిల్లా జైళ్ల పర్యవేక్షణాధికారి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తొలి బ్యాచ్‌గా చిత్తూరు జైల్లో 34 మందికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చామన్నారు. ఖైదీల జీవనోపాధుల కోసం మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు ఇక్కడ ఓపెన్ స్కూల్ ద్వారా చదివే అవకాశం కల్పిస్తున్నామన్నారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్, న్యాక్ ఏడీ సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే చేర్పిద్దాం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని డీఈఓ వరలక్ష్మి కోరారు. ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్‌లపై యూటీఎఫ్ సంఘం రూపొందించిన పోస్టర్లను బుధవారం డీఈఓ ఆవిష్కరించారు. ప్రభుత్వ బడుల గొప్పదనం తెలుపుతూ యూటీఎఫ్ సంఘం రూపొందించిన పోస్టర్లు చాలా బాగున్నాయన్నారు. ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్‌ల పెంపునకు యూటీఎఫ్ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని డీఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, జిల్లా సహాధ్యక్షులు రెహానా బేగం , రెడ్డెప్ప, ఎస్పీ భాషా, పార్థసారథి పాల్గొన్నారు.



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న డీఈఓ వరలక్ష్మి

'పుర' పనులపై విజిలెన్స్ కొరడా

- 5 మంది అధికారులపై చర్యలు
- రూ.26 లక్షల రికవరీ?

పుంగనూరు : పురపాలిక పరిధిలో 2014–15 సంవత్సరంలో జరిగిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లేదని విజిలెన్స్ అధికారులు పదేళ్ల తరువాత నిద్రలేచి జూలు విదిల్చారు. దీనికి సంబంధించి 5 మందితో పాటు మరో ఇద్దరు అధికారులు, ఇద్దరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం . ఇందులో భాగంగా ఈనెల 7న ఆదేశాలు జారీ చేస్తూ 5 మంది ఇంజినీర్లను బాధ్యులుగా చేశారు. ఈ ఆదేశాలు మంగళవారం పురపాలికకు చేరాయి. మున్సిపాలిటీలో పనిచేసి బదిలీపై వెళ్లిన, రిటైర్డ్ అయిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నట్లు ఆదేశాలు రావడంతో ఉద్యోగులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పదేళ్ల కిందట చేసిన పనుల్లో నాణ్యత లేదని విజిలెన్స్ వారు పంపిన నివేదికలపై ప్రస్తుతం చర్యల చేపట్టడంతో ఉద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల నిర్వహణలో భాగస్వాములైన ఇంజనీర్లు డీఈఈ గా పని చేసిన నారాయణస్వామి, అలాగే విశ్రాంత డీఈఈ పద్మనాభరావు, విశ్రాంత ఏఈ సుబ్బరామయ్యతో పాటు ప్రస్తుత డీఈఈలు ఇతర మున్సిపాలిటీల్లో పని చేస్తున్న రవీంద్రారెడ్డి, కృష్ణకుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా సదరు పనుల్లో నాణ్యత లేని కారణంగా సుమారు రూ.26 లక్షలు ఆ ఉద్యోగుల నుంచి రికవరీ చేయనున్నట్లు సమాచారం. కాగా 10 ఏళ్ల తరువాత ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పుంగనూరు మున్సిపాలిటీ

ఒంటిమిట్టకు 12 టన్నుల కూరగాయలు

పలమనేరు : పట్టణానికి చెందిన శ్రీవారి సేవకులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి మిత్ర బృందం కలిసి కర్ణాటక రాష్ట్రం బంగారుపేట కూరగాయల మార్కెట్ నుంచి కోలారు ఎమ్మెల్యే మంజునాథ్ సహకారంతో ఒంటిమిట్ట కోదండరాముని ఆలయంలో ఈనెల 11న జరిగే శ్రీరామ నవమి ఉత్సవాలకు భక్తులకు అన్నదానం కోసం 12 టన్నుల వివిధ కూరగాయలను, 80 వేల నిమ్మకాయలను బుధవారం టీటీడీ ప్రత్యేక వాహనం ద్వారా ఒంటిమిట్టకు పంపారు. టీటీడీ అధికారుల సూచనల మేరకు తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.



టీటీడీ వాహనం ఎదుట శ్రీవారి సేవకులు

కాలిపోయిన కోళ్లఫాంను పరిశీలించిన పెద్దిరెడ్డి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు) : మండలంలోని చెరువు ముందరపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగిరెడ్డికి చెందిన కోళ్ల ఫాం గోడౌన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో గోడౌన్‌లోని సుమారు రూ.15 లక్షల విలువ చేసే వస్తు సామగ్రి కాలిపోయింది. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, నిరంజన్‌రెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డి, జెడీ నారాయణ పాల్గొన్నారు.

నేడు, రేపు ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతికి కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గ్రేడ్–3 ఏఎన్‌ఎం ఉద్యోగోన్నతికి సంబంధించిన తుది జాబితా ఎట్టకేలకు పూర్తయింది. గతేడాది ప్రారంభమైన జాబితా తయారీ ప్రక్రియ...పలు ఆరోపణల నడుమ బుధవారం సాయంత్రానికి పూర్తి చేశారు. 1000 మందిపైగా గ్రేడ్–3 ఏఎన్‌ఎంలుంటే 307 మందితో ఈ జాబితా సిద్ధం చేశారు. గురు, శుక్రవారాల్లో ఉద్యోగోన్నతికి సంబంధించి కౌన్సెలింగ్ చిత్తూరు నగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. డీఆర్‌ఓ సమక్షంలో కౌన్సెలింగ్ జరగనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిపై కొంతమంది మళ్లీ అభ్యంతరం తెలుపుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశామని అంటున్నారు.

తిరుపతి–కాట్పాడి డబ్లింగ్‌కు ఆమోదం

- 104 కిలోమీటర్లు రూ.1332 కోట్లతో నిర్మాణం
- అభివృద్ధి కానున్న ఆధ్యాత్మిక, వాణిజ్య రంగాలు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా రైల్వే చరిత్రలో కీలక ఘట్టానికి అడుగు పడింది. ఎప్పటి నుంచో జిల్లావాసులు కోరుకుంటున్న తిరుపతి–కాట్పాడి డబ్లింగ్‌కు బుధవారం కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తిరుపతి–కాట్పాడి మధ్య 104 కిలోమీటర్ల లైన్‌ను రూ.1332 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు.

తిరుపతి–కాట్పాడి మధ్య దాదాపు 10 స్టేషన్ల మీదుగా దాదాపు 400 గ్రామాల నుంచి నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో ఎక్కువగా గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, తిరుచానూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, తిరుమల, ఆలయాలకు వేల మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. లైన్ డబ్లింగ్ చేయడం వల్ల ప్రయాణ సమయం తగ్గి రైళ్ల రాకపోకలు పెరగనున్నాయి. సింగిల్ లైన్ కారణంగా రైళ్ల వెయిటింగ్‌తో ప్రయాణికులకు చిరాకు తప్పదు. అదే డబ్లింగ్‌తో వేచి ఉండే సమస్య తగ్గుతుంది.


పెరగనున్న రద్దీ

తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాలకు భక్తుల రద్దీ మరింత పెరుగుతుంది. చంద్రగిరి కోటకు వీక్షకులు పెరగనున్నారు. తిరుపతి మీదుగా చంద్రగిరి, ముంగిలిపట్టు, పానపాకం, పాకాల, పూతలపట్టు, చిత్తూరు, సిద్దంపల్లె, రామాపురం, బొమ్మసముద్రం స్టేషన్ల మీదుగా కాట్పాడికి రాకపోకలు సాగిస్తుంటారు. అదనపు లైన్‌తో ఆధ్యాత్మిక, వాణిజ్య రంగాలు అభివృద్ధి కానున్నాయి. ప్రస్తుతం తిరుపతి–కాట్పాడికి 3 ప్యాసింజర్ రైళ్లు ఉండగా అవి రోజు ఆరు ట్రిప్పులు ద్వారా సుమారు 5 వేల మంది ప్రయాణికులను చేరవేస్తోంది. వీటితో పాటు శేషాద్రి, కన్యాకుమారి, శబరి, కేరళ, ఎక్స్‌ప్రెస్‌లు ద్వారా బెంగళూరు–కాకినాడ, పూణే, హైదరాబాద్, కొచ్చిన్, త్రివేండం, న్యూఢిల్లీకి వేల మంది వెళ్తున్నారు. డబుల్‌లైన్ వేయడం ద్వారా మరిన్ని ఎక్స్‌ప్రెస్‌లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఈ రైళ్లు ఆపండి సారూ..

తిరుపతి–రామేశ్వరం, హౌరా–పాండిచ్చేరి, ఓకా–రామేశ్వరం, తిరుపతి–రామేశ్వరం, టాటా–యశ్వంత్‌పూర్ రైళ్లు చిత్తూరు మీదుగా వెళ్తున్నప్పటికీ ఇక్కడ స్టాపింగ్స్ లేవు. ఈ రైలులో ప్రయాణించాలంటే పాకాల లేదా తిరుపతికి వెళ్లి ఎక్కాల్సిందే. వేలూరు నుంచి చైన్నెకు వెళ్లే రైలును చిత్తూరు నుంచి ఎక్కే సౌకర్యం కల్పించాలనే జిల్లావాసులు ప్రధాన డిమాండ్ తీర్చాలని కోరుతున్నారు.

జూనియర్ రెడ్‌క్రాస్ బృందానికి అభినందన

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయిలో పాల్గొని అవార్డులు సాధించిన జూనియర్ రెడ్‌క్రాస్ బృందానికి కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందనలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ స్థాయిలో అవార్డులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిన బృంద విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. మార్చి 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఒడిస్సా రెడ్‌క్రాస్ సొసైటీ భువనేశ్వర్‌లో నిర్వహించిన పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మోహన్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ రమేష్‌బాబు, కోశాధికారి తేజోమూర్తి, పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు.. రూ.8 లక్షలు స్వాధీనం

చిత్తూరు అర్బన్ : పూతలపట్టులో పేకాట ఆడుతున్న పది మంది జూదరులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. బండపల్లె సమీపంలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు ఎస్పీకి బుధవారం సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాలతో దాడులు చేసిన పోలీసులు పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.8 లక్షల నగదు, 15 ద్విచక్ర వాహనాలు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే ఫోన్–112, పోలీసు వాట్సాప్ 9440900005 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ మణికంఠ కోరారు.

యువతిని వేధించిన వ్యక్తిపై కేసు

పుంగనూరు : మండలంలోని పూజగానిపల్లెలో మంగళవారం రాత్రి ప్రేమించాలని ఓ యువతి ని వేధించి, ద్విచక్ర వాహనానికి నిప్పుపెట్టిన యువకుడిపై కేసు నమోదు చేశారు. బుధవా రం ఎస్‌ఐ లోకేష్ మాట్లాడుతూ.. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు.

వాషింగ్ మిషన్ చోరీ

శ్రీరంగరాజపురం : మండలంలోని ఆరిమాకులపల్లిలో వెలసిన గంగమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాషింగ్ మిషన్ చోరీకి గురైంది. ఆలయ పూజారి వెంకటాచలం కథనం మేరకు గంగమ్మ గుడి ఆవరణలో పూజారి నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి పూజారి కుటుంబ సభ్యులు ఇంటిలో నిద్రించగా దొంగలు ఇంటి బయట ఉన్న వాషింగ్ మిషన్‌ను దొంగలించారు. గతంలో ఇదే ఆలయంలో రెండు సార్లు హుండీ చోరీ జరిగింది. ఆలయ పూజారి వెంకటాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ పేర్కొన్నారు.

అర్హులందరికీ వ్యవసాయ పరికరాలు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు : జిల్లాలో 50 శాతం సబ్సిడీ వ్యవసాయ పరికరాల పంపిణీలో రాజకీయ నేతల ప్రమేయం లేకుండా అర్హులైన వారికి తప్పకుండా పరికరాలను అందజేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఆ మేరకు తమ్ముళ్లకు యంత్రసాయం అనే శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. స్థానిక వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయంలో పలమనేరు, కుప్పం ఆశాఖ అధికారులతో సమీక్షించారు. ఇప్పటి దాకా మండలాల వారిగా వ్యవసాయ పరికరాలకు ఎంత మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. లక్ష్యం ఎంత, ఇప్పటి దాకా ఎంత చేశారని అడిగి తెలుసుకున్నారు. ఇందులో రాజకీయాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాను రాజకీయ నేతలకు ఎందుకు ఇస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. జిల్లాలో మొత్తం 3.24 లక్షల మంది రైతులుండగా వీరిలో 2.25 లక్షల మంది ఇంకా రైతు గుర్తింపు కార్డులకు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం కూర్మాయి గ్రామంలో రైతు చందూల్‌రెడ్డి సాగు చేసిన దేశీయ వరి పంటను ఆయన సందర్శించారు. ఆపై ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన నలభై రకాల టమాట విత్తనాలను పరిశీలించారు. ఏడు మండలాల ఏవోలు, ఏడీ గీతాకుమారి, జెడ్‌బీఎన్‌ఎస్ మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జేడీఏ

చిత్తూరులో అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి ఆడియో రిలీజ్

కాణిపాకం : చిత్తూరు నగరంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం రాత్రి అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి చిత్ర ఆడియో అట్టహాసంగా లాంచ్ చేశారు. సినిమా హీరో నందమూరి కళ్యాణ్‌రామ్, హీరోయిన్ సాయి మంజ్రేకర్, నటీనటులు విజయశాంతి, పృథ్వీ, దర్శకుడు ప్రదీప్ చిలకూరి, నిర్మాతలు అశోక్ వర్ధన్, సునీల్, కాలేజీ చైర్మన్లు రావూరి వెంకటస్వామి, రావూరి శ్రీనివాసులు, ఎడిటర్ తమ్మిరాజు, రైటర్ శ్రీకాంత్, ఎస్పీ మణికంఠ చందోలు పాల్గొని చిత్ర ఆడియోను ఆవిష్కరించారు. అనంతరం సినిమా చిత్రీకరణ, కథ అంశాన్ని వివరించారు. మ్యూజిక్, తల్లీ, కొడుకు మధ్య జరిగే సన్నివేశాలు ఆకట్టుకుంటాయన్నారు. ఈనెల 18వ తేదీ సినిమా రిలీజ్ కానుందన్నారు. ప్రేక్షకులు, అభిమానులు సినిమాను ఆదరించాలన్నారు. అభిమానులు ఈ రిలీజ్ వేడుకకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ఆడియో ఆవిష్కరణ సభలో చిత్ర బృందం



వీఆర్‌ఏల నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలో వీఆర్‌ఏలు

పలమనేరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని వీఆర్‌ఏలు బుధవారం తమ డిమాండ్ల సాధన కోసం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా నెలకు 11 వేల జీతంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. తమకు నెలసరి వేతనాన్ని రూ.26 వేలు దాకా పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓ వినతిపత్రాన్ని తహసీల్దార్ అన్నురాజన్‌కు అందజేశారు. ఇందులో సీపీఎం నేత ఓబుల్‌రాజు, పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కుప్పం : కుప్పం రైల్వే స్టేషన్ సమీపంలోని కొత్తపేట వద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో హుటాహుటిన కుప్పం వంద పడకల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు చెప్పారు. మృతుడికి 30 సంవత్సరాల వయస్సు కలిగి, చామనఛాయ రంగు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సంబంధిత రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని సైకిలిస్టు దుర్మరణం


పార్థసారథి (ఫైల్)

చిత్తూరు అర్బన్ : నగర శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పార్థసారథి (55) అనే వ్యక్తి మృతి చెందాడు. కొంగారెడ్డిపల్లికి చెందిన ఆయన చిత్తూరు సైకిల్ రైడర్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్నారు. రోజూ తలకు హెల్మెట్ ధరించి సైకిల్ రైడ్‌కు వెళ్లడం పార్థసారథికి అలవాటు ఈ క్రమంలో తిరుపతి రోడ్డు నుంచి చిత్తూరు వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో దురదృష్టవశాత్తు హెల్మెట్ ఇంట్లో మరిచిపోయి.. అలాగే సైకిల్ రైడ్‌కు వచ్చేశారు. సైకిల్ నుంచి కిందపడి ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పార్థసారథి మృతిపై చిత్తూరు సైకిల్ రైడర్స్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

బాలుడిని ఢీకొట్టిన వ్యాను


చికిత్స పొందుతున్న బాలుడు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని ప్రశాంత్‌నగర్ కాలనీ సమీపంలో లీలాద్రి (8) అనే బాలుడిని వ్యాను ఢీ కొట్టడంతో పరిస్థితి విషమంగా మారింది. తమిళనాడుకు చెందిన రాజా అనే వ్యక్తి రాజంపేట నుంచి అరటికాయలను తీసుకుని వానియంబాడీకు వెళ్లడానికి గూగుల్ మ్యాప్ ద్వారా వ్యాను నడుపుతూ బయలుదేరాడు. వాహనం ప్రశాంత్‌నగర్ కాలనీలోని వైఎస్సార్ కాలనీ సమీపానికి వస్తుండగా రోడ్డు దాటుతున్న లీలాద్రి అనే బాలుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి పక్కటెముకలు విరగడంతో రాణిపేటలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తాలూకా ఎస్‌ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా..తప్పిన ప్రమాదం



గంగవరం : మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో గోశాల వద్ద శనగల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వస్తున్న లారీ గోశాల వద్ద అదుపు తప్పింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పుంగనూరు : పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండుకు చెందిన అష్రఫ్ (25) ద్విచక్ర వాహనంపై వస్తుండగా కారు ఢీకొని గాయపడ్డాడు.వివరాలు ఇలా.. బుధవారం ద్విచక్ర వాహనంలో బయటకు వెళ్లి తిరిగి పుంగనూరుకు వస్తుండగా మార్గ మధ్యలోని గుడిసెబండ సమీపంలో కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అష్రఫ్‌ను స్థానికులు గమనించి అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు

– అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు


జయప్రకాష్(ఫైల్)

చౌడేపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె రూరల్ పోలీస్ స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తోటి జయప్రకాష్(42)కు చౌడేపల్లె మండలం బయ్యపల్లె గ్రామంలో బుధవారం కన్నీటి వీడ్కోలు పలికారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు మార్గ మధ్యలో జయనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 5 వతేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ భరోసా ఇచ్చారు. అంత్యక్రియలకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. రూరల్ ఇన్‌స్పెక్టర్ కళా వెంకటరమణ, ఎస్‌ఐ నాగేశ్వరరావు, ఏఆర్ పోలీసులు అధికారిక లాంఛనాలతో జయప్రకాష్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

మహేశ్వరయ్య..మజాకానా!

- పంచాయతీ కార్యదర్శి ఆస్తులు రూ.30 కోట్లు
- ఏసీబీ సోదాల్లో వెలుగుచూసిన వైనం


గంగవరం సమీపంలోని కూర్నిపల్లి వద్ద ఫామ్ హస్ పక్కనే నాలుగెకరాల మామిడి తోట

పలమనేరు : ఆయనో సాధారణ పంచాయతీ కార్యదర్శి.. ఆయనకొచ్చే జీతంతో ఆ కుటుంబానికి సరిపోతుంది. మిగిలేదేమీ పెద్దగా ఉండకపోవచ్చు. కానీ ఆయన అందరిలాంటి వాడు కాదు.. ఏకంగా ఆ చిన్న ఉద్యోగంతోనే రూ.30 కోట్లు సంపాదించి ఔరా అనిపించారు. ఇటీవల చంద్రగిరి పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వేర్వేరుచోట్ల ఏసీబీ అధికారులు దాడులు చేయగా తిరుపతిలో రెండిళ్లు, రెండుసైట్లు, రెండు కార్లు, కేజీ బంగారం, రెండు కిలోల వెండి, 5 లక్షల నగదు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇవికాక బెంగళూరులో అపార్ట్‌మెంట్, బద్వేలో బంధువులపై భూములు వెలుగు చూశాయి. తాజాగా రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులు పలమనేరు, గంగవరంలలో సోదాలు చేశారు. ఇక్కడ సాయి నగర్‌లో షాపింగ్ కాంప్లెక్స్, జీప్లస్ ఇళ్లు, కూర్నిపల్లి వద్ద ఫామ్‌హౌస్ పక్కనే నాలుగెకరాల పొలాన్ని గుర్తించారు. ఈ ఆస్తులన్నీ చూసిన ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

సంఘాల అభివృద్ధికి చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : క్రెడిట్ అండ్ లైవ్‌లీ హుడ్ ప్రణాళికను పక్కాగా సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు పలు శాఖల అధికారులతో బుధవారం కలెక్టర్ వరుస సమావేశాలు నిర్వహించారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ కోరారు. సంఘాల ఆధ్వర్యంలో పొందే రుణాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సంఘం సభ్యులకు సంబంధించిన నగదును బ్యాంకుల్లో డిపాజిట్ చేయకుండా ఇబ్బంది పెట్టే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు మంజూరు చేసే రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

11న ఉద్యానవన పంటలపై సమావేశం

జిల్లా కేంద్రంలో ఎన్‌పీసీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉద్యానవన పంటలపై సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 11న జిల్లా కేంద్రంలో ఉద్యాన పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 72 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా మామిడి 25 మండలాల్లో ప్రధాన పంటగా, మామిడిలో తోతాపురి ఎక్కువగా సాగులో ఉండడం వల్ల దిగుబడి ఏటా లభిస్తోందన్నారు. మామిడి గుజ్జు తయారీకి చిత్తూరు ప్రధాన కేంద్రంగా మారిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మామిడి పంట, దిగుబడి నిలకడగా లేకపోవడం వల్ల మామిడి గుజ్జు ఎగుమతులపై ప్రభావం చూపిందన్నారు. ఇందుకు సంబంధించి అవగాహన కల్పించేందుకు రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉద్యాన పంటల అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందన్నారు. జిల్లాలోని రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఏఎంసీ చైర్మన్ గిరి ఎవరికో!

- పలమనేరు బీసీ మహిళలకు రిజర్వేషన్ ఖరారు
- ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఎంపికలో అధిష్టానం
- బలంగా వినిపిస్తున్న ఇద్దరి పేర్లు

పలమనేరు : నియోజకవర్గంలో ఎమ్మెల్యే తర్వాత ప్రొటోకాల్ ఉన్న పోస్టు మార్కెట్ కమిటీ చైర్మన్. ఏఎంసీ చైర్మన్‌కు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాల్లో సముచిత స్థానం ఉంటుంది. దీంతో తాజాగా కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని పలు మండలాల నాయకుల కన్ను చైర్మన్ కుర్చీపై పడింది. జిల్లాలోని పది మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఆ మేరకు పలమనేరు ఏఎంసీ బీసీ మహిళలకి కేటాయించారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ఏఎంసీలకు కొత్త చైర్మన్లను కూటమి ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఈ జాబితాలో పలమనేరు కనిపించలేదు. ఎందుకంటే దీనికి కూటమి నేతల్లో ఎక్కువగా డిమాండ్ ఉండడం, స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఎవరిని సూచిస్తున్నారు, ఇదే సమయంలో పార్టీ అధిష్టానం ఇటీవల చేపట్టిన ఐవీఆర్‌ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా ఎవరి పేరు వచ్చిందనే విషయం స్థానికంగా హాట్‌టాపిక్ మారింది.


పలమనేరు ఏఎంసీ కార్యాలయం

ఇప్పుడే డిమాండ్ ఎందుకంటే..

పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ వద్ద 33 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్‌ను రూ.55 కోట్లతో నిర్మించనున్నారు. ఇది జిల్లాలోనే మోడల్ మార్కెట్‌గా చేయాలని మార్కెటింగ్ అధికారులు నిర్ణయించారు. హైవేకు ఆనుకుని వాణిజ్య సముదాయాలను నిర్మించనున్నారు. మార్కెట్‌కు వచ్చిన కూరగాయలకు అక్కడికక్కడే ప్యాకింగ్, గ్రేడింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. రైతుల సౌకర్యార్థం క్యాంటీన్లు, రైతు విశ్రాంతి గదులు తదితరాల నిర్మాణాలు ఉంటాయి. దీనికి సమీపంలోనే పశువులు, గొర్రెల వారపు సంతలుంటాయి. ఇలాంటి మోడల్ మార్కెట్ రూ.33 కోట్లతో పనులు జరుగనున్న నేపథ్యంలో తమ ఆధ్వర్యంలోనే ఇక్కడ ఇంటిగ్రేటెట్ మార్కెట్ ప్రారంభించామని చెప్పుకోవచ్చు. పైగా ఇందులో వారికి తగిన ప్రతిఫలం దక్కుతుందనే మాట గట్టిగా వినిపిస్తోంది.

ఆ ఇద్దరు ఎవరు?

మొన్నటి దాకా ఇక్కడి బీసీ మహిళా రిజర్వేషన్‌ను మార్చి జనరల్ చేస్తారనే మాట వినిపించింది. కానీ పలమనేరు నియోజకవర్గంలో ఎక్కువగా బీసీ ఓటర్లు ఉండడంతో ముందు నిర్ణయించినట్లే రిజర్వేషన్లలో మార్పు లేకుండా పోయింది. ఇక్కడ టీడీపీని అంటిపెంటుకున్న బీసీ కులాల్లో 22 వేల దాకా కురబ సామాజిక వర్గ ఓటర్లున్నారు. మిగిలిన బీసీ కులాల్లో వాల్మీకి, వడ్డెర, పల్లెగొండర్‌ల ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్ గిరి కోసం గంగవరం మండలానికి చెందిన ఓ బీసీ యువనేత సతీమణి పేరు గట్టిగా వినిపిస్తోంది. మరోవైపు స్థానిక ఎమ్మెల్యేకు వీర విధేయుడైన బైరెడ్డిపల్లికి చెందిన ముఖ్య నాయకుడి సతీమణి సైతం బరిలో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజాభిప్రాయమా.. స్థానిక ఎమ్మెల్యే అనుచరులకా

ఇప్పటి దాకా స్థానిక ఎమ్మెల్యే ఎవరిని సూచిస్తే వారికి ఏఎంసీ చైర్మన్ గిరి దక్కడం జరిగేది. కానీ పలమనేరు ఏఎంసీకి సంబంధించి అధిష్టానమే ఫోన్‌ల ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తోందని తెలిసింది. ఆ మేరకు స్థానిక ఎమ్మెల్యే సూచించిన వారికే పదవి దక్కుతుందా లేదా అధిష్టానం మాట చెల్లుతుందా అనేది వేచి చూడాల్సిందే. ఏదేమైనా ఏఎంసీ చైర్మన్ విషయంలో పార్టీ కోసం కష్టపడిన బీసీలకే న్యాయం జరగాలనే మాట నియోజవర్గంలోని ఆ పార్టీ బీసీల్లో గట్టిగా వినిపిస్తోంది.